క్లుప్తంగా

ప్రజలకు ఎమ్మెల్యే సంక్రాంతి శుభాకాంక్షలు



ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే అలజంగి జోగారావు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో ఆదివారం మాట్లాడిన ఆయన పండగను అందరూ ఆనందంగా నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. ఈ సంక్రాంతి ప్రతి ఇంటా సంతోష కాంతులు నింపాలని కోరారు. పండగ పూట ఎవరూ అసాంఘిక కార్యాకలాపాలకు పాల్పడవద్దని, స్నేహపూరిత వాతావరణంలో వేడుకలు జరుపుకోవాలని హితవు పలికారు.

పశువులకు 'గాలికుంటు' నివారణ టీకాలు



పశువులకు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

సీతానగరం: స్థానిక సబ్‌డివిజన్ పరిధిలోని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు ఆదివారం వేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు డాక్టర్ సీహెచ్ దీనకుమార్ ఆధ్వర్యంలో 3 నెలలు దాటిన పశువులకు ముందస్తు జాగ్రత్తగా టీకాలు వేశారు. సీతానగరం మండలంలో 14,500 పశువులు ఉండగా, ఇప్పటివరకు 6,279 పశువులకు, బలిజిపేట మండలంలోని 29,496 పశువులకు గాను 6,171 పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయడం జరిగింది. వ్యాక్సిన్ వేసిన పశువుల్లో పాలదిగుబడి తగ్గిపోతుందని, పశువులకు జ్వరం వస్తుందన్న అపోహలు వీడాలని, రైతులను అధికారులు కోరుతున్నారు.

డిప్యూటీ సీఎం రాజన్నదొరకు సంక్రాంతి శుభాకాంక్షలు



చిన్నారులకు శుభాకాంక్షలు తెలిపి, మిఠాయి తినిపిస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

సాలూరు: డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొరకు స్థానిక పట్టణ ప్రముఖులు, మండలంలోని పలు గ్రామాల పెద్దలు, యువతీయువకులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం ఆయనను ఆయన స్వగృహంలోనే వీరంతా కలిసి, భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలిపి, ఎప్పుడూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఆయన కూడా వారందరికీ పండగ శుభాకాంక్షలు తెలిపి, శుభాశీస్సులు అందజేశారు.

వస్త్రదానం

పాలకొండ రూరల్: సాంప్రదాయ పండగలను అందరితో కలిసి చేసుకోవటం అలవర్చుకోవాలని విశ్రాంత ఉపాధ్యాయులు కోట మోహనరావు అన్నారు. భోగి పండగ సందర్భంగా ఆదివారం పనుకువలస గ్రామంలో 50 మందికి నూతన వస్త్రాలు వితరణ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కోట మంజు భార్గవి, ఎంపీటీసీ, వైఎస్సార్‌సీపీ మండల జేసీఎస్ కన్వీనర్ కోట అజేయ్‌బాబు, జానర్దనరవు, సతీష్, పి.ముకుందరావు, దాత కుటుంబ సభ్యులు సుధీర్‌కుమార్, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

కోడిరామ్మూర్తినాయుడికి ఘన నివాళి



తెలగవీధిలో కోడి రామ్మూర్తినాయుడు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న స్థానికులు

వీరఘట్టం: ప్రపంచ మల్లయోధుడు కోడిరామ్మూర్తి నాయుడి వర్ధంతిని స్థానిక తెలగవీధి వాసులు ఘనంగా నిర్వహించారు. వీధిలో ఉన్న ఆయన విగ్రహానికి ఆదివారం పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. చరిత్ర ఉన్నంత వరకు మల్లయోధుడు కోడి రామ్మూర్తినాయుడు ఈ ప్రపంచానికి గుర్తుంటారని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు దొలూరు సత్యారావు పేర్కొన్నారు. కలియుగ భీముడిగా ఆయన చేసిన సాహసాలను గుర్తుచేసుకున్నారు. అలాగే ఎమ్మెర్సీ వద్ద, వీరఘట్టం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఉన్న కోడి రామ్మూర్తినాయుడు విగ్రహాలకు స్థానికులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఏనుగుల సంచారంపై ఆందోళన

కొమరాడ: గజరాజుల గుంపు నెలరోజులుగా కుమ్మరిగుంట, గంగారేగువలస, కందివలస గ్రామాల్లోని పొలాల్లో సంచరిస్తూ వరి, టమోట, జొన్న పంటలను ధ్వంసం చేస్తున్నాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏనుగుల సంచారంపై అప్రమత్తం చేసేందుకు నియమితులైన ట్రాకర్లు ఎక్కడున్నారో కానరావడం లేదన్నారు.

భోగభాగ్యాల భోగి



పార్వతీపురం టౌన్: పట్టణంలోని ఓ వీధిలో వేసిన భోగి మంట



పార్వతీపురం టౌన్: పట్టణంలో వేసిన భోగి మంట



సీతానగరం: వెంకటాపురంలో భోగి మంట



పార్వతీపురం టౌన్: సంప్రదాయ వస్త్రధారణలో భోగి పండగలో పాల్గొన్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు



సీతానగరం: బూర్జలో భోగి మంట వద్ద జిల్లా మలేరియా నివారణ అధికారి జగన్మోహనరావు, తదితరులు



పార్వతీపురం టౌన్: సంగంవలస గ్రామంలో భోగి మంట వద్ద గ్రామస్తులు



బలిజిపేట: వెంగాపురంలో భోగి మంట వద్ద గ్రామస్తుల సందడి

వాడవాడలా భోగి పండగ ఆదివారం ఘనంగా నిర్వహించారు. తెలుగు ప్రజలకు అత్యంత ఇష్టమైన ఈ వేడుకలో చిన్నాపెద్దా అనే తేడా లేకుండా అందరూ పాల్గొని, ఆనందంగా గడిపారు. వేకువజామున తలస్నానం చేసి, సంప్రదాయ వస్త్రధారణతో భోగిమంట వేసి, చలికాగారు. పనికిరాని పాతవస్తువులను అందులో వేసి, భోగభాగ్యాలతో పాటు సరికొత్త కాంతులను ఈ భోగి నింపాలని ఆకాంక్షించారు. –సాక్షి నెట్‌వర్క్

వైభవంగా గోదాదేవి కల్యాణోత్సవం



బలిజిపేట: వెంగాపురంలో గోదాదేవి, రంగనాథుల కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



సీతానగరం: ప్రత్యేకాలంకరణలో గోదాదేవి, వేణుగోపాలస్వామి



పార్వతీపురం టౌన్: గోదాదేవి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

పార్వతీపురం టౌన్: ధనుర్మాసం ముగింపు పురస్కరించుకుని, స్థానిక శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవి, రంగనాథస్వామిల కల్యాణం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద మంత్రోచ్చరణల నడుమ ఆలయ ప్రధానార్చకులు జగన్నాథాచార్యుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కల్యాణ మహోత్సవం జరిపించారు. ఏటా ధనుర్మాసంలో 30 రోజుల పాటు కొనసాగే శ్రీ ఆండాల్ అమ్మవారి తిరుప్పావై పఠనం అనంతరం జరిగే గోదాదేవి కల్యాణంతో ధనుర్మాసం ముగుస్తుందన్నారు. పవిత్రమైన హృదయంతో శ్రీరంగనాథుని నిత్యం పూలమాలలతో సేవించి, శ్రీవారికే తన జీవితం అర్పించిన మహాభక్తురాలు గోదాదేవి అని, అటువంటి గోదాదేవికి ధనుర్మాసంలో పూజలు చేస్తే శుభాలు కలుగుతాయన్నది భక్తుల ప్రగాఢ విశ్వాసమని అర్చకులు తెలిపారు. ఈ కల్యాణ వేడుకలు చూసేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు.

బలిజిపేట: మండలంలోని వెంగాపురం రామాలయంలో అర్చకులు గోపాలకృష్ణ, ప్రవీన్, సూర్యనారాయణ, ఫణికుమార్ ఆధ్వర్యంలో గోదాదేవి కల్యాణోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ధనుర్మాసం ముగింపు సందర్భంగా ఈ కల్యాణం జరిపినట్లు అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మురళి, తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం: మండలంలోని పలు గ్రామాల్లోని ఆలయాల్లో గోదాదేవి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమం చూసి, తరించేందుకు చుట్టుపక్కల ప్రాంతాల భక్తులు పోటీపడ్డారు.

ముగ్గుల పోటీలు



సంగంవలసలో ముగ్గులు పోటీల్లో పాల్గొన్న మహిళలు

పార్వతీపురంటౌన్: సంక్రాంతి సంబరాల్లో భాగంగా మండలంలోని సంగంవలస, ఎన్.ములగ, ఎమ్మార్‌నగరం, చినబొండపల్లి గ్రామాల్లో యువత ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలతో పాటు మ్యూజికల్ చైర్, నృత్య ప్రదర్శన పోటీలు ఆదివారం నిర్వహించారు. బాలికలు, యువతులు, మహిళలంతా ముగ్గుల పోటీలో పాల్గొని, రకరకాల రంగవల్లులు వేసి, తమ ప్రతిభ కనబరిచారు. ఆయా పోటీలతో గ్రామాల్లో సంక్రాంతి సందడి నెలకొంది.

మహిళలకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: మండలంలోని పెదమరికి గ్రామంలో పార్వతీపురం నియోజకవర్గం పరిధిలోని నిరుపేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన మహిళలకు ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆదివారం చీరలు పంపిణీ చేశారు. సంక్రాంతి పండగ సందర్భంగా తనవంతు సాయంగా అక్కచెల్లెమ్మలకు ఇస్తున్న ఈ చిరుకానుకను స్వీకరించాలని ఎమ్మెల్యే కోరారు. అందరికీ పండగ శుభాకాంక్షలు అని, సుఖసంతోషాలతో సంక్రాంతి వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నేత రాగాల సోమశేఖర్, సర్పంచ్ జక్కు ప్రవీణ్‌కుమార్, స్థానిక నాయకులు తుమరాడ పకీరునాయుడు, ఎం.భాస్కర్, జన్ని గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి కానుకల పంపిణీ



గ్రీన్‌అంబాసిడర్లకు సంక్రాంతి కానుకలను అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణకు నిరంతరం శ్రమిస్తున్న గ్రీన్‌అంబాసిడర్లకు భోగి పండగ సందర్భంగా ఆదివారం స్థానిక వర్తక, వైశ్య సంఘం సభ్యులు సర్పంచ్ బి.గౌరీశంకరరావు, వైస్ ఎంపీపీ నిమ్మక శేఖర్ చేతుల మీదుగా సంక్రాంతి కానుకలను పంపిణీ చేశారు. గ్రీన్ అంబాసిడర్ల సేవలను వారు కొనియాడారు. కార్యక్రమంలో వర్తక, వైశ్య సంఘాల అధ్యక్షులు విష్ణు, జి.హరిప్రసాద్, సభ్యులు, వైస్ సర్పంచ్ కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' కలయిక



సీతానగరం: తమ గురువులతో పూర్వ విద్యార్థులు

పార్వతీపురంటౌన్: స్థానిక ఎమ్మార్‌నగరం జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల కలయిక పాఠశాలలో ఆదివారం జరిగింది. 1998 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులంతా సమావేశమై, ఆనాటి తీపి జ్ఞాపకాలను ఒకసారి గుర్తుకు తెచ్చుకుని, ఆనందంగా గడిపారు. అనంతరం వారి గురువుల ఆశీస్సులు పొందారు. పాఠశాల, గ్రామాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో మన్మథరావు, వరప్రసాద్, ఆదినారాయణ, రాధాకృష్ణ, చిత్రంజన్, భాస్కరరావు, శ్రీను, గౌరీశంకర్, నరేంద్ర, నీలిమ తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం: మండలంలోని బూర్జ గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాల 1985–86 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ కలయిక పాఠశాలలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని, ఆనాటి తీపి స్మృతులను జ్ఞాపకం చేసుకున్నారు. ఆటపాటలు, కబుర్లతో సరదాగా కాలక్షేపం చేశారు. అనంతరం అప్పటి తమ గురువులు రెడ్డి అర్జుననాయుడు, జామి సూరిదాసు, శీర గంగునాయుడు దంపతులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎం.సన్యాసిరావు, పూర్వ విద్యార్థులు వి.పారినాయుడు, ఆరిశెట్టి వెంకటరావు, వేదుల శర్మ, ముకుంద, ఆరిశెట్టి గోవిందరావు, కె.అప్పలస్వామి, వై.సత్యంనాయుడు, కె.స్వామినాయుడు, తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురంటౌన్: సమావేశమైన ఎమ్మార్‌నగర్ పాఠశాల పూర్వ విద్యార్థులు

అలజంగిలో మేలుకొలుపు

బొబ్బిలి: మండలంలోని అలజంగిలో ఆదివారం వేకువజామున మేలుకొలుపు నిర్వహించారు. వీధుల్లో భజనలు, భక్తి గీతాలు ఆలపించారు. సమరసత ఫౌండేషన్ డివిజన్ ధర్మ ప్రచారకుడు ధూపం వాసు పాల్గొని ధర్మ ప్రవచనాలను పఠించారు.

బ్యాడ్మింటన్ పోటీ విజేత కురుపాం

జియ్యమ్మవలస: మండలంలోని దాసరిపేట గ్రామంలో స్వామీ వివేకానంద యూత్ ఆధ్వర్యంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న ఉత్తరాంధ్ర జిల్లాల మెన్స్ డబుల్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ఫైనల్స్‌లో కురుపాం జట్టు విజేతగా నిలిచింది. కురుపాం, రాజాం జట్ల మధ్య ఫైనల్స్ జరగగా.. కురుపాం విజేతగా నిలిచింది. విజేత జట్టుకు రూ.10 వేలు, రన్నర్ జట్టుకు రూ.5 వేలు, మూడో స్థానంలో నిలిచిన పార్వతీపురం జట్టుకు రూ.3 వేలు చొప్పున నగదు బహుమతిని వైఎస్సార్‌సీపీ నాయకుడు అంధవరకు కోటేశ్వరరావు చేతులమీదుగా ఆదివారం అందజేశారు. టోర్నీ నిర్వహణకు ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు రూ.10 వేలు, అంధవరకు కోటేశ్వరరావు రూ.8 వేలు విరాళంగా ఇచ్చినట్లు నిర్వాహకులు మక్కువ బలరాం, ఆదినారాయణ తెలిపారు.

రచ్చబండ ప్రారంభం

రేగిడి: మండలంలో ఖండ్యాం గ్రామానికి చెందిన యువత రూ.3 లక్షలతో నాగావళి నదీతీరంలో నిర్మించిన రచ్చబండను పోలేటి వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ కింజరాపు సురేష్‌కుమార్, మాజీ సర్పంచ్ గొలివి జగ్గునాయుడు ఆదివారం ప్రారంభించారు. గ్రామంలోని వృద్ధులు, యువత సేదతీరేందుకు వీలుగా యువకులంతా కలిసి నదీతీరంలో రచ్చబండను నిర్మించడం చాలా ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో బూసి అప్పలనాయుడు, తంగి ప్రసాదరావు, బూసి ప్రసాదరావు, యువత పాల్గొన్నారు.

ఎస్సైగా జనార్దననాయుడు

వంగర: స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్సైగా వై.వి.జనార్దననాయుడు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎస్సై ఆర్.జనార్దనరావు బదిలీపై వెళ్లడంతో కొత్తవలస పోలీస్ స్టేషన్ ఎస్సైగా పనిచేస్తున్న జనార్దననాయుడు ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది సహకారంతో మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న సేవా సంఘం సభ్యులు

వీరఘట్టం: సంక్రాంతి పండగ సందర్భంగా కత్తులకవిటి గ్రామంలో గ్రామానికి చెందిన సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. గ్రామస్తుల సహకారంతో కొనుగోలు చేసిన టేకు, మద్ది, వేప, నిద్రగన్నేరు తదితర 200 మొక్కలను గ్రామ రహదారికి ఇరువైపులా నాటి కంచెలు ఏర్పాటు చేశారు. పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సేవా సమితి సభ్యుడు జంపు ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. అలాగే గ్రామంలో 500 మందికి హైదరాబాద్‌కు చెందిన స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు వంజరాపు శ్రీధర్, వైఎస్సార్‌సీపీ నాయకులు రౌతు రుషీకేశవరావు, గేదెల సుదర్శనరావు, కొత్తవలస మనోజ్‌కుమార్, దనుకొండ ఉదయ్‌కుమార్, మునగపాక శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ పరీక్షకు విశేష స్పందన

సంతకవిటి: మండలంలోని బొద్దూరు గ్రామంలో 'మేముసైతం' యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు ఆదివారం ప్రతిభ పరీక్ష నిర్వహించారు. ప్రతీ తరగతిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన ముగ్గురికి వరుసగా రూ.1000, రూ.800, రూ.500, కన్సోలేషన్ బహుమతిగా రూ.300లు చొప్పున నగదు అందజేశారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు పార్వతి, వి.సన్యాసినాయుడు, విజయలక్ష్మి, రిటైర్డ్ టీచర్ వి.దామోదరరావు, ప్రకాశరావు, పాగిరి, సంతకవిటి, బొద్దూరు తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు

వంగర: మండలంలోని ఓనెఅగ్రహారం గ్రామంలో సర్పంచ్ కాబోతుల పార్వతి జ్ఞాపకార్థం నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కాబోతుల శ్రీనివాసునాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో 20కి పైగా జట్లు పాల్గొన్నాయి. సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నారు.